గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గోల్నాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ కమలానగర్‌లో మండేపల్లి గంగపుత్ర సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. గంగమ్మతల్లి గుడి నిర్మాణానికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. గంగపుత్రుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అంబర్‌పేట నియోజకవర్గం గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పాకచందర్, ప్రధానకార్యదర్శి పెద్దపల్లి చంద్ర శేఖర్, మండేపల్లి గంగపుత్ర సంఘం చైర్మన్ మాల్ కాశీరాం, అధ్యక్షులు సందరి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి మాల్ యాదగిరి, కోశాధికారి మాల్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు సింగీతం సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు వినాయక ప్రతిమ అందజేస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు

గంగపుత్రుల అభివృద్ధికి సహకారం : ఎమ్మెల్యే కాలేరు

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో గంగపుత్రులు రాణించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో నిర్మించిన గంగపుత్ర భవనాన్ని కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగపుత్రుల అభివృద్ధి, సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి మాట్లాడుతూ.. గంగపుత్రులకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి. వెంకటరెడ్డి, అంబర్‌పేట గంగపుత్రుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా వేదప్రకాష్

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు ఏబీ వేద ప్రకాష్‌యాదవ్ నియమితులయ్యారు. కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు కెప్టెన్ అజయ్‌సింగ్‌యాదవ్ ఆయనకు ఆదివారం నియామకపత్రం అందజేశారు. వేద ప్రకాష్‌యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు.



వేదప్రకాష్‌కు నియామకపత్రం అందజేస్తున్న అజయ్‌సింగ్ యాదవ్

ఆత్మరక్షణకు బాలికలకు కరాటేలో శిక్షణ ఇప్పించాలి



పతకాలు సాధించిన విద్యార్థులతో జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్యమిశ్రా

బర్కత్‌పుర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం బాలికలకు కరాటేలో శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులకు జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా సూచించారు. కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశ ప్రతిష్ఠను చాటి చెప్పాలన్నారు. ఆదివారం కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో ఇటీవల జరిగిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో 34 బంగారు పతకాలు, 3 రజత పతకాలు సాధించిన అకాడమీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి, కరాటే మాస్టర్‌లు నర్సింగ్‌రావు, కరీం, అమృతా రెడ్డి, ఘన సంతోషిణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్ట్‌లు ప్రదానం చేసిన మీర్ వహాజ్ అలీఖాన్

విద్యార్థులకు కరాటే బెల్ట్‌ల బహూకరణ

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందితే రక్షణ కోసం ఎంతో ఉపయోగపడుతుందని తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మీర్ వహాజ్ అలీ ఖాన్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో ఆదివారం తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ బి. కృష్ణ ఆధ్వర్యంలో తైక్వాండో విద్యార్థులకు కలర్, బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్, సర్టిఫికెట్లు బహూకరించారు. మీర్ వహాజ్ అలీఖాన్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ పాల్గొని సర్టిఫికెట్లు, బెల్ట్‌లు ప్రదానం చేశారు. కోచ్‌లు మనీష్, రఘు, ఎన్. స్వామి, టి. రాకేష్, డి. ప్రభు పాల్గొన్నారు.

'నిరుద్యోగం పెరగడానికి కేంద్రం విధానాలే కారణం'

బర్కత్‌పుర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో నిరుద్యోగం పెరగడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణం అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలీఉల్లాఖాద్రి, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఆరోపించారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ ఆఫీస్ బేరర్ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం వల్ల నిరుద్యోగం మరింత పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, కె. శంకర్, టి. సత్యప్రసాద్, యుగంధర్, మహేందర్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

'మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి'

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాలు నిర్మించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఉత్సవ నిర్వాహకులకు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. వినాయకచవితి పండగను పురస్కరించుకుని మండపాల నిర్వాహకులతో ఆదివారం చిక్కడపల్లి స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అడ్మిన్ ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైలులో 16 తులాల నగలు చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి నగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లో నివసిస్తున్న భాస్కర్‌రావు, రత్నకుమారి దంపతులు బెంగళూర్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఏ-2ఏసీ కోచ్‌లో నగరానికి వస్తున్నారు. మార్గమధ్యంలో రత్నకుమారి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అందులో 16 తులాల బంగారు నగలు, సెల్ ఫోన్ ఉంది. బాధితురాలు ఆదివారం కాచిగూడకు వచ్చిన తర్వాత రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్పీజీతో ఇస్త్రీ చేద్దామా?

సమయం, ఖర్చు ఆదా చేయనున్న సరికొత్త ఐరన్ బాక్స్



- బొగ్గుతో శ్రమపడే కార్మికులకు ఊరట
- ఆదాయం పెరుగుదలకు దోహదం
- ఇతర రాష్ట్రాల్లో పెరిగిన వాడకం
- నగరవాసులకు పరిచయం చేసేందుకు రోటరీ క్లబ్ కృషి

ఎర్రగడ్డ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బొగ్గును మండించి.. ఇస్త్రీపెట్టె వేడెక్కే వరకూ వేచి ఉండి, ఇస్త్రీ చేయాలంటే కార్మికులకు శ్రమతో పాటు, సమయం కూడా వృథా అవుతోంది. బొగ్గుతో వచ్చే పొగతో అనారోగ్యానికీ ఆస్కారం ఉంది. వీటికి చెక్ పెడుతూ ఎల్పీజీ ఇస్త్రీపెట్టెలు వాడుకలోకి వస్తున్నాయి. ఇస్త్రీ పెట్టెలో బొగ్గు మండించి వేడెక్కడానికి దాదాపు గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. ఎల్పీజీలో కేవలం రెండు నిమిషాలకే ఐరన్ బాక్స్ వేడెక్కుతుంది. బొగ్గు ఖరీదు కన్నా ఎల్పీజీ ఖర్చే తక్కువ. దీంతో కార్మికుల ఆదాయం కూడా పెరుగుతుంది. బొగ్గు పొగ వల్ల కార్మికులకు కలిగే దుష్పరిణామాలూ ఉత్పన్నం కావు. బొగ్గుతో ఇస్త్రీ చేసే కార్మికులకు ఉపశమనంగా ఎల్పీజీ ఐరన్ బాక్స్‌లను పరిచయం చేయడానికి రోటరీ క్లబ్ కృషి చేస్తోంది. ఎల్పీజీ ఐరన్ బాక్స్‌తో గల లాభాలను కార్మికులకు తెలియజేస్తోంది.



ఎల్పీజీ బాక్స్‌తో ఇస్త్రీ చేస్తున్న కార్మికుడు

ఎన్నో లాభాలు

బొగ్గు ఇస్త్రీపెట్టె బరువు సుమారు 10.5 కేజీలు ఉంటుంది. ఎల్పీజీ బాక్స్ 6.5 కేజీలు మాత్రమే. అధిక బరువు ఉండే బొగ్గు ఇస్త్రీపెట్టె వల్ల కార్మికులు చేతి కండరాలు, కీళ్లనొప్పులతో బాధపడతారు. కిలో బొగ్గుతో ఆరు గంటలు పనిచేస్తే, కిలో ఎల్పీజీతో ఈ ఐరన్ బాక్స్ మూడు రోజుల వరకు పనిచేస్తుంది. రోజుకు 8 నుంచి 10 గంటల వరకు కరెంట్ ఐరన్‌బాక్స్‌తో ఇస్త్రీ చేస్తే నెలకు సుమారు రూ. 8,000 నుంచి 10,000 వరకు బిల్లు వస్తుంది. కరెంటు బాక్స్‌తో ఒక ప్యాంటు ఇస్త్రీకి మూడు రూపాయలు ఖర్చు రాగా, బొగ్గుల బాక్స్‌తో రూ.1.35 అవుతుంది. ఎల్పీజీతో కేవలం 55 పైసలు మాత్రమే ఖర్చవుతుందని నిపుణులు చెబుతున్నారు. బొగ్గు ఇస్త్రీపెట్టెతో నెలకు రూ.2,500 ఖర్చు వస్తే, ఎల్పీజీకి కేవలం రూ. 800 మాత్రమే ఖర్చు అవుతుంది. దీంతో కార్మికుడికి సుమారు రూ.1,700 లాభం ఉంటుంది. ఒక్కసారి బొగ్గును మండిస్తే, పని ఉన్నా లేకపోయినా అది కాలిపోతూ ఇంధనం వృథా అవుతుంది. కానీ, గ్యాస్ స్టౌను ఆఫ్ చేసినట్లు ఎల్పీజీని కూడా ఆఫ్ చేసుకోవచ్చు. బొగ్గుల పెట్టె ద్వారా ఉత్పన్నమయ్యే కార్బన్ ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతింటాయి. ఎల్పీజీతో కార్బన్ చాలా తక్కువగా విడుదలవుతుంది. కాబట్టి అలాంటి సమస్యలు ఉండవు.

కేవలం రెండు నిమిషాల్లో వేడెక్కుతుంది



బొగ్గుతో ఇస్త్రీ పెట్టె వేడెక్కాలంటే రెండు గంటలు వేచి ఉండే వాళ్లం. ఎల్పీజీ ఐరన్ బాక్స్ కేవలం రెండు నిమిషాల్లోనే వేడెక్కుతుంది. సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి.

\- ధర్మ, పాండురంగ నగర్

ఎల్పీజీ బాక్స్‌లను వాడుకలోకి తేవడానికి కృషి



బొగ్గు ఇస్త్రీ పెట్టెతో కష్టాలు పడుతున్న కార్మికులకు ఊరటగా ఎల్పీజీ ఐరన్ బాక్సులను వాడుకలోకి తేవడానికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే చాలామంది కార్మికులకు ఈ ఐరన్ బాక్స్‌లను అందజేశాం. మహిళా కార్మికులు 50 మంది కలిసి ముందుకు వస్తే వారికి సబ్సిడీ ద్వారా అందజేస్తాం. 7729070809 నంబర్(రోటరీక్లబ్, హైదరాబాద్)లో సంప్రదించవచ్చు.

\- ఏ. మోహనవంశీ, రోటరీ క్లబ్, జిల్లా అసిస్టెంట్ గవర్నర్



గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ యాకర అమృత





అంబేడ్కర్, వీర సావర్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను శుభ్రం చేసిన బీజేపీ నాయకులు



మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

బర్కత్‌పుర/నల్లకుంట/అంబర్‌పేట/గోల్నాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు సూచించారు. బీజేపీ జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాచిగూడ డివిజన్‌లోగల సమరయోధుడు వీరసావర్కర్, లింగంపల్లి చౌరస్తాలోని అంబేడ్కర్, శివాజీనగర్‌లోని శివాజీ, డీడీ కాలనీలోగల దుర్గాబాయి దేశ్‌ముఖ్, సత్యానగర్ బస్తీలో అంబేడ్కర్, తిలక్‌నగర్ బస్తీలోని జాతిపిత గాంధీజీ విగ్రహాలను కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, యాకర అమృతతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 12 నుంచి 14 వరకు మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల చుట్టూ పరిశుభ్రత కార్యక్రమాలు, 11 నుంచి 14 వరకు తిరంగా యాత్ర, 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం, 14న విభజన గాయాల స్మారక దినం సందర్భంగా సమ్మేళనాలు, సదస్సులు, 13న అమర వీరుల స్మారక చిహ్నాలు, విగ్రహాల వద్ద పుష్పాంజలితో నివాళి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు కృష్ణ కుమార్, శ్యామ్‌రాజ్, నల్లకుంట డివిజన్ కన్వీనర్ కేబీ నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

● అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలోగల అంబేడ్కర్ విగ్రహాన్ని బీజేపీ నేతలు ఆదివారం శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్, అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు దాసోజు నాగ భూషణంచారి, నాయకులు కృష్ణగౌడ్, వెంకటస్వామిగౌడ్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గంగానగర్‌లోగల స్వామి వివేకానంద విగ్రహాన్ని బీజేపీ నాయకులు శుభ్రం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. గౌతమ్‌రావు, నాయకులు కేసరి నర్సింగ్‌రావు యాదవ్, కె. రాంచందర్, మరికంటి కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటండి

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేవైఎం సికింద్రాబాద్ మహాకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో ఆదివారం తిరంగా బైక్ ర్యాలీ రాంనగర్ చౌరస్తా నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వరకు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిషన్‌రెడ్డి ముందుగా భారతమాత చిత్రపటం, శివాజీ విగ్రహానికి పూలమాల వేసి బైక్‌ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ మహాకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, కార్పొరేటర్లు కె. రవిచారి, రచనశ్రీ, పావని వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పలు ప్రాంతాల్లో ఘనంగా బోనాలు

ముషీరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కట్టమైసమ్మ, నల్లపోచమ్మ దేవాలయాల్లో అమ్మవారికి బోనంతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, బీజేపీ దళిత మోర్చా నగర ఉపాధ్యక్షుడు కృష్ణ, బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వైశ్రీనివాస్‌రావు, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు నర్సింగ్‌రావు అతిథులను సత్కరించారు.

జవహర్‌నగర్‌లో..

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోగల లక్ష్మీఉప్పలమ్మ దేవాలయంలో ఆదివారం బోనాలు ఉత్సవాలు నిర్వహించారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కవాడిగూడలో..

కవాడిగూడ: కోదండరెడ్డినగర్‌లోని నల్లపోచమ్మ, చిత్రాలనగర్‌లోని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం బోనాల వేడుకలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్పొరేటర్ జి రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్ కుమార్, కవాడిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శులు ఎ. ప్రభాకర్, కేశవ రాజ్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి జి. రమేష్ పాల్గొన్నారు.

గోల్నాకలో..

గోల్నాక: వడ్డెరబస్తీలోని ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అమ్మవారికి పూజలు నిర్వహించారు.





ముషీరాబాద్, కవాడిగూడలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ జి. రచనశ్రీ తదితరులు

నిస్వార్థ సేవకురాలు డొక్కా సీతమ్మ

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సేవాగుణం ఉంటే పది మందికి సాయం చేయవచ్చని డొక్కా సీతమ్మ నిరూపించారని సీబీఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆదివారం ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా డొక్కా సీతమ్మ యాదిలో సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగమారుతిశర్మ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రం కరువుతో విలయతాండవం చేస్తున్న సమయంలో గోదావరి జిల్లాల్లో రోజూ వందలమంది అన్నార్తులకు ఆహారం అందించిన డొక్కా సీతమ్మ నిస్వార్థ సామాజిక సేవాపరాయణ అన్నారు. అధికారం, పదవి లేకపోయినా గుణం ఉంటే సాయం చేయవచ్చని ఆమె చెప్పకనే చెప్పారన్నారు. ఆస్తి అంతా దానధర్మాలకు వెచ్చించి చివరిదశలో పేదరికం అనుభవించినా ఏనాడూ సీతమ్మ బాధపడలేదన్నారు. జర్నలిస్టు జయసూర్య సీతమ్మ జీవితకథను వివరించారు. అభినందన భవానీ, సామాజిక కార్యకర్త వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగమారుతిశర్మ

అంబర్‌పేటలో కబడ్డీ పోటీలు ప్రారంభం

అంబర్‌పేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అంబర్‌పేట ఇండోర్ మైదానంలో హైదరాబాద్, రంగారెడ్డి డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్-2024 పోటీలను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రేమ్‌రాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు చంద్రయ్యగౌడ్, ఆనంద్, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

'శైలజామిత్ర ఆదర్శనీయురాలు'

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కథ, కవిత్వ రచనలో ప్రతిభను చాటిన శైలజామిత్ర ఎందరికో ఆదర్శనీయురాలని బళ్లారి తెలుగు సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఆర్. దేవణ్ణ అన్నారు. ప్రముఖ రచయిత్రి, కవయిత్రి శైలజామిత్ర రచించిన జన్మించడమే కవిత్వం కవితాసంపుటి, వష్టి కథాసంపుటి పరిచయ సభ ఆదివారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో వియల సాహితీ సమితి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవణ్ణ మాట్లాడుతూ.. మానవ సంబంధాలను కేంద్రీకృతం చేసుకుని శైలజామిత్ర అద్భుతంగా సాహిత్యం వెలువరిస్తున్నారని ప్రశంసించారు. అధ్యక్షత వహించిన బిక్కి కృష్ణ మాట్లాడుతూ.. శైలజామిత్ర రచనలు చదివిస్తాయన్నారు. ప్రముఖ కవయిత్రి, కుసుమ ధర్మన్న ఫౌండేషన్ అధ్యక్షురాలు డా. రాధా కుసుమ మాట్లాడుతూ.. నిత్యజీవిత అంశాలు, సందేశం, కొత్త కథనం వష్టి కథాసంపుటిలో కనిపిస్తాయన్నారు. చదివించే, ఆలోచింపచేసే, మానవీయసంబంధాలు మెరుగుపరిచే చక్కటి కథలు ఇందులో ఉన్నాయన్నారు. ప్రముఖ కవి, రచయిత ఎస్. నరసింహరాజు మాట్లాడుతూ.. కవిత్వమంటేనే కవికి మరోజన్మ అన్నారు. నిర్వాహకులు జెల్ది విద్యాధర్, మిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు శైలజామిత్రను సన్మానించారు. తొలుత కవిసమ్మేళనం జరిగింది.

ఆకట్టుకున్న సీల్‌వెల్ సరిగమలు

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గంగోత్రి కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీల్‌వెల్ సరిగమలు శీర్షికతో ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని కళాభారతి సంస్థలో ఆదివారం జరిగిన సినీ సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో కిషోర్, సుజాత, దేవాన్ష్, పసుల లక్ష్మణ్, చిన్నికృష్ణ, విఠల్, మానస, వికాస్ తదితరులు సినీగీతాలు ఆలపించారు. ప్రాజ్ఞిక సంస్థ సభ్యులు ప్రవీణ్, పారిజాత గాయనీ గాయకులను సన్మానించారు.

బైలాస్ ప్రకారం మేరు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బైలాస్ ప్రకారం ఈనెల 18న మేరు సంఘం ఎన్నికలు నిర్వహించాలని అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న కీర్తి రాజగోపాల్, ఆయన ప్యానెల్ సభ్యులు ఎన్నికల కమిటీని కోరారు. ఓటమి భయంతోనే మేరు సంఘం జేఏసీ నాయకుడు సంగ వీరప్ప ఎన్నికలు వాయిదా వేయాలని కోర్టుకు వెళ్లారని వారు ఆరోపించారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రాజగోపాల్ ప్యానెల్ సభ్యులు, మద్దతుదారుల సమావేశం జరిగింది. రాజగోపాల్ మాట్లాడుతూ.. ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. గత పాలకవర్గం సంఘాన్ని తమ స్వార్థం కోసం వాడుకుందని ఆరోపించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ ఎలాంటి ఒత్తిడికి లొంగకుండా ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రమేష్, సంగీవర్, వి. మాధవ్, కె. వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పింగళి వెంకయ్య పురస్కారాలను అందజేస్తున్న నిర్వాహకులు

దేశ ఆత్మగౌరవానికి ప్రతీక పింగళివెంకయ్య

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశ ఆత్మగౌరవానికి ప్రతీక పింగళి వెంకయ్య అని విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్ అన్నారు. పింగళి వెంకయ్య కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో త్రివర్ణపతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సమరయోధులకు జోహార్లు శీర్షికతో పలువురికి పింగళి వెంకయ్య పురస్కారాలను ప్రదానం చేశారు. నిర్వాహకులు రంజిత్‌కుమార్, మూస అలీఖాన్, బ్రహ్మానందం, ఆంజనేయులు, బిక్కునాథ్‌నాయక్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమలగూడ మున్సిపల్ క్వార్టర్స్ కార్యవర్గం ఎన్నిక

కవాడిగూడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ మున్సిపల్ క్వార్టర్స్ కార్యవర్గం ఎన్నికలు మున్సిపల్ క్వార్టర్స్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి కమ్యూనిటీహాల్‌లో బస్తీ కమిటీ చైర్మన్ పి. శాంతికుమార్ పర్యవేక్షణలో ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా పానుగంటి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా జె. నరేష్‌కుమార్, యూత్ అధ్యక్షుడిగా జె. శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జి. మనోజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. మున్సిపల్ క్వార్టర్స్‌లో సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.